క్లుప్తంగా

సమస్యలను వెంటనే పరిష్కరించండి

సీటీఆర్ఐ: వాంబే గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి స్థానికులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆదెమ్మ దిబ్బ వాంబే గృహాలను స్థానిక కూటమి నాయకులు, అధికారులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లీకవుతున్న శ్లాబ్‌లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. మంచినీటి సౌకర్యం కల్పించాలని, అక్కడ ఉన్న మోటార్లు సక్రమంగా పని చేసేలా చూడాలన్నారు. మురుగునీరు సక్రమంగా పారేలా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ఆదేశించారు. ప్రజలు తమకు విన్నవించిన ప్రతి సమస్యకు పరిష్కరిస్తామని అన్నారు.

కాంగ్రెస్ నగర కార్యాలయం సందర్శన



పార్టీ కార్యాలయాన్ని సందర్శించిన పరిశీలకులు శివాజీ

రాజమహేంద్రవరం సిటీ: కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకులుగా నియమితులైన పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ మంగళవారం పార్టీ రాజమహేంద్రవరం నగర కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు మరింత ఆదరించి, పూర్వ వైభవంతో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే వార్డు స్థాయి కమిటీలను నియమించి పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు. అనంతరం కార్యాలయ రిజిస్టర్‌లో సంతకం చేసి నగర కమిటీ సభ్యులతో పార్టీ స్థితిగతుల కోసం చర్చించారు.

పలు పనులకు శంకుస్థాపనలు

కడియం: పల్లె పండుగ వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం మండలంలోని పొట్టిలంక, వీరవరం గ్రామాల్లో పలు సీసీ రోడ్లు, బరియల్ గ్రౌండ్ ఆధునీకీకరణ పనులకు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో గ్రామాల అభివృద్ధికి బాటలు పడుతున్నాయన్నారు. వీరవరంలో రూ. 15లక్షలతో సీసీ రోడ్లు, పొట్టిలంకలో రూ.6 లక్షలతో బరియల్ గ్రౌండ్ ఆధునీకీకరణ పనులు ప్రారంభించామన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఎంపీడీవో కే రమేష్, తహసీల్దార్ పోసిబాబు, ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బంగారం చోరీ

కంబాలచెరువు: స్థానిక ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 250 గ్రాముల బంగారం చోరీకి గురైన ఘటనపై మంగళవారం కేసు నమోదైంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్యామలానగర్‌కు చెందిన బి.శ్రీనివాస్ తన పిల్లలతో కలిసి దసరా సెలవులకు గత నెల 29న హైదరాబాద్ వెళ్లాడు. అతను తిరిగి ఈ నెల 14వ తేదీన ఇంటికి వచ్చే సరికి బీరువా తెరిచి అందులో ఉన్న నగలు మాయమయ్యాయి. జరిగిన సంఘటనపై శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

బాధితుడికి సొమ్ము అప్పగింత

కంబాలచెరువు: అపరిచిత వ్యక్తుల ద్వారా పోగొట్టుకున్న సొమ్మును సైబర్ సెల్ పోలీసులు రికవరీ చేసి మంగళవారం బాధితునికి అప్పగించారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లికార్జున నగర్‌కు చెందిన శ్రీకాంత్ ఈ నెల ఐదో తేదీన యాక్సిస్ బ్యాంకు ఏటీఎం కార్డు పిన్ మర్చిపోయాడు. దానిని తిరిగి పొందేందుకు గూగుల్‌లో సర్చ్ చేశాడు. అతనికి యాక్సిస్ బ్యాంకు ఫేక్ ఫోన్ నెంబర్ వచ్చింది. ఆ ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయగా అవతలి వారు పలు వివరాలు అడిగారు. శ్రీకాంత్ ఫోన్‌కు వచ్చిన ఓటీపీని చెప్పమన్నారు. అతను వారికి చెప్పగా తర్వాత కొద్ది క్షణాల్లో తన ఖాతాలోని రూ.55,999 కట్ అయినట్టు మెసేజ్ వచ్చింది. వెంటనే అతను 1930కు ఫోన్ చేయగా అది పనిచేయలేదు. దీంతో అతను సైబర్ సెల్‌ను సంప్రదించాడు. సైబర్ సెల్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి బాధితుడు పోగొట్టుకున్న సొమ్మును తిరిగి అప్పగించారు.

సినిమాలు

శ్యామల:	వేట్టయన్
సూర్యమినీ:	జిగ్రా
సూర్యప్యాలెస్:	దేవర
శివజ్యోతి:	విశ్వం
అనుశ్రీ:	జనక అయితే గనక
స్వామి:	శ్వాగ్
అశోక:	విశ్వం
రాజా:	మార్టిన్
రంభ:	మానాన్న సూపర్‌హీరో
ఊర్వశి:	వేట్టయన్
మేనక:	సత్యం సుందరం,మార్టిన్
కుమారి:	దేవర
అప్సర:	దేవర
నామవరం:	
వివిఎస్.మహల్:	వేట్టయన్,దేవర
ధవళేశ్వరం	
మురళీకృష్ణ:	దేవర
కడియం:	
వెంకటసూర్య:	వేట్టయన్

ప్రయాణం నరకప్రాయం

- గోతులమయంగా బొమ్మూరు - రాజవోలు రోడ్డు
- వర్షం వస్తే వాహనచోదకులకు తప్పని ఇక్కట్లు
- జిల్లా అధికారులంతా ఆ రోడ్డులోనే ప్రయాణం
- మరమ్మతులకు నోచుకోని వైనం



మహిళా ప్రాంగణం వద్ద గోతులమయంగా ఉన్న ఆర్ అండ్ బీ రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి రోజు వేలాది మంది వాహనచోదకులతో పాటు, జిల్లా ప్రభుత్వ అధికారులు సైతం ఆ రోడ్డులో ప్రయాణిస్తుంటారు. ఆ రోడ్డు అంతా గోతులమయంగా ఉంది. దీంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. అధికారులు ప్రయాణించే రోడ్డు అయినా ఎవరూ పట్టించుకోవడంలేదు. అదే బొమ్మూరు నుంచి రాజవోలు వెళ్లే రహదారి. ఈ దారిలో మహిళా ప్రాంగణం వద్ద ఆర్‌అండ్‌బీరోడ్డు అధ్వానంగా ఉంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బొమ్మూరు నుంచి రాజవోలు వెళ్లేరోడ్డులో 200 మీటర్ల పరిధిలో మహిళా ప్రాంగణం వద్ద భారీ గోతులు పడ్డాయి. వర్షం వస్తే చాలు ఆ గోతులు కనపడక వాహనచోదకులు పడి గాయాలు పాలవుతున్నారు. నిత్యం ఈ రోడ్డులో కేశవరం నుంచి రాజమహేంద్రవరానికి వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. అంతే కాకుండా మహిళాప్రాంగణం ఆవరణలో డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం, ఐసీడీఎస్ కార్యాలయం, సైన్స్ సెంటర్, సమీపంలో తహసీల్దార్ కార్యాలయం, వైటీసీలో జిల్లా పంచాయతీ అధికారి వారి కార్యాలయం, డ్వామా, జిల్లా పరిశ్రమల శాఖ, జిల్లా సూక్ష్మ నీటిపారుదల శాఖ, జిల్లా అగ్నిమాపక అధికారి, జిల్లా పరిశ్రమల శాఖ తదితర కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయంలోని ఉన్నతాధికారులందరూ ఈ రోడ్డులోనే ప్రతిరోజు రాకపోకలు సాగిస్తుంటారు. గత నెల రోజులుగా ఈఆర్‌అండ్‌బీరోడ్డు పరిస్థితి గోతులతో అధ్వానంగా ఉంది. ఇటీవల రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల సైతం మహిళా ప్రాంగణంలో ఉచిత శిక్షణ కార్యక్రమాలను సైతం ప్రారంభించారు. అయినా ఈ గోతులకు మాత్రం మోక్షం కలగలేదు. అధికారులు ప్రయాణించే ఈ రోడ్డుకే మోక్షం లేకుంటే సామాన్యుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్ అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

అధికారులు తిరుగుతున్నా..



మహిళాప్రాంగణం వద్ద ఆర్ అండ్‌బీరోడ్డు గోతులు వలన వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే గోతుల్లో నీరు చేసి కనిపించకపోవడంతో చాలా మంది గాయాలు పాలవుతున్నారు. నిత్యం ఈ రోడ్డులో జిల్లా ప్రభుత్వ అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. కావున అధికారులు స్పందించి ఆర్‌అండ్ బీరోడ్డుపై గోతులకు మరమ్మతులు చేపట్టాలి.

– పెయ్యల రాజేష్, రాజవోలు

చేతుల శుభ్రతతో రోగాలు దూరం



శాటిలైట్‌సిటీలో హ్యాండ్ వాష్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మ్యాజిక్‌బస్ సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: చేతుల శుభ్రతతోనే రోగాలు దూరమవుతాయని శాటిలైట్‌సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.రాజరాజేశ్వరి అన్నారు. మంగళవారం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మ్యాజిక్‌బస్ ఆధ్వర్యంలో శాటిలైట్‌సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హ్యాండ్‌వాష్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని రాజరాజేశ్వరి మాట్లాడుతూ మనం తాకే వస్తువుల్లో అనేక రకాల సూక్ష్మక్రిములు ఉంటాయని చేతులు శుభ్రంగా ఉంచుకోకపోతే ప్రమాదకరమని హెచ్చరించారు. రక్తహీనతకు కారణమయ్యే కొంకిపురుగులు, నులి పురుగులు దరిచేరకుండా చిన్నప్పటి నుంచే చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, మ్యాజిక్ బస్ సిబ్బంది పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

- నేటి యువతరానికి ఆయన స్ఫూర్తిదాయకం
- కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించిన జక్కంపూడి రాజా, షర్మిలా రెడ్డి



అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి తదితరులు

సీటీఆర్ఐ: దేశం కోసం అబ్దుల్ కలాం చేసిన సేవలు మరువలేనివని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు, మాజీ శాసన సభ్యులు జక్కంపూడి రాజా అన్నారు. మంగళవారం అబ్దుల్ కలాం 93వ జయంతి సందర్భంగా స్థానిక నందం గన్నిరాజు జంక్షన్ వద్ద యాంకర్ చోటు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏపీ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టి.కే విశ్వేశ్వరరెడ్డి, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, సీసీసీ ఛానల్ ఎండీ పంతం కొండలరావు తదితరులు పాల్గొని అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ పేదరికం నుంచి భారత అత్యున్నత పదవికి ఎదిగిన కలాం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారన్నారు. అంతరిక్ష శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా అత్యున్నత పదవులు అలంకరించినప్పటికీ నిరాడంబర జీవితాన్ని కొనసాగించి మహనీయుడు ఏపీజే అబ్దుల్ కలాం అని, ఆయన జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు బోడా వెంకట్, ఆదిత్య విద్యాసంస్థల ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు,ఆదిత్య డిగ్రీ కాలేజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కంబాలచెరువు: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని నందం గన్నిరాజు సెంటర్లో ఘనంగా నిర్వహించారు. రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మేడపాటి షర్మిలరెడ్డి, ఆదిత్య విద్యాసంస్థ డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, సి.సి.సి ఎం.డి పంతం కొండల రావు, టి.కె.విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా అబ్దుల్ కలాం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. ఈ వేడుకలకు ఆదిత్య డిగ్రీ, మహిళా డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి, కె.మహేశ్వరి పి.సాయి వలంటీర్లను ఈ బృహత్ కార్యక్రమంలో పాల్గొనడానికి సహకరించారు. ప్రతి సంవత్సరం అత్యంత శ్రద్ధగా తన యువసేనతో చోటు ఈ వేడుకలు జరపడానికి ముందు ఉంటాడని ఆదిత్య రమాదేవి చోటును అభినందనలతో ముంచెత్తారు.

భారతరత్న అబ్దుల్ కలాంకు ఘననివాళి

కడియం: భారతదేశపు మిస్సైల్ మ్యాన్, ఆదర్శ రాష్ట్రపతి, విద్యావేత్త, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం 93వ జయంతిని స్థానిక ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచాన్ని ప్రభావితం చేసిన వ్యక్తుల్లో కలాం ఒకరని, ఆయన సేవలను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు హెచ్ఎం సత్యనారాయణ, స్టాఫ్ కార్యదర్శి జి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. పలువురు విద్యార్థులు కలాం గొప్పదనం గురించి వివరించారు.

ధవళేశ్వరం: స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి స్ఫూర్తి చారిటబుల్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలను పోసికుమార్ కొనియాడారు.



కలాంకు నివాళులర్పిస్తున్న కడియం ఉపాధ్యాయులు, విద్యార్థులు

సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధం



హెడ్ పోస్టాఫీస్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా ఉద్యోగులు

- పోస్టల్ ఉద్యోగుల నిరసన

రాజమహేంద్రవరం సిటీ: తపాలా శాఖలో వివిధ కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం దశల వారీ పోరాట కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు రాజమహేంద్రవరం తపాల ఉద్యోగుల సంఘం కార్యదర్శి బి.కొండ బాబు పేర్కొన్నారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయూస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధమవుతున్నట్టు ప్రకటించారు. దీనిలో భాగంగా మంగళవారం నగరంలో హెడ్ పోస్టాఫీస్ వద్ద పోస్టల్ ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కొండ బాబు మాట్లాడుతూ ఈ పోరాటాలలో భాగంగా 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ నల్ల బ్యాడ్జీలను ధరించి డిమాండ్లతో కూడిన పోస్ట్ కార్డ్, ఈ మెయిల్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్టు ప్రకటించారు. అలాగే వచ్చే నెల 12, 13 తేదీల్లో ఢిల్లీలోని డాక్ భవన్ ముందు నిరాహార దీక్ష చేయనున్నట్టు తెలిపారు. రద్దు చేసిన ఎన్ఎఫ్‌పీఈ, ఏఐపీఈయూ గ్రూప్–సీ యూనియన్ గుర్తింపును వెంటనే పునరుద్ధరించాలన్నారు. తపాలా శాఖను కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ దిశగా ప్రోత్సహించే పోస్టల్ యాక్ట్–2023ను వెనక్కి తీసుకోవాలన్నారు. ఐపీపీబీ ఆధ్వర్యంలో నడిపిస్తున్న సాంకేతికపరమైన అన్ని పనులను గతంలో మాదిరిగా తపాలాశాఖ ఆధ్వర్యంలో నడిపించేలా వెనక్కి తీసుకోవాలని, 8వ వేతన సవరణ కమిటీ వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం డిమాండ్ల సాధనకు దీర్ఘకాల పోరాటానికి సిద్ధంగా ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డిమాండ్లను తెలియజేస్తూ డివిజనల్ సూపరింటెండెంట్‌కి మెమొరాండంను అందజేశారు. ఈకార్యక్రమంలో పీ4 యూనియన్ సెక్రటరీ జె.వి.సత్యనారాయణ, రాజమహేంద్రవరం జీడీఎస్ యూనియన్ సెక్రటరీ పి.భూలోకం, పీ3 యూనియన్ ప్రెసిడెంట్ యు.జి.ప్రకాష్, పీ4 యూనియన్ ప్రెసిడెంట్ ఐ.శ్రీనివాస్, జీడీఎస్ యూనియన్ ప్రెసిడెంట్ బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త కమిటీల ఏర్పాటుతో కాంగ్రెస్ బలోపేతం



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: గ్రామ, వార్డు స్థాయిలో కాంగ్రెస్ అనుబంధ విభాగాలను ఏర్పాటు చేసి, తద్వారా పార్టీ బలోపేతానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్టు జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ పరిశీలకులు కె.శివాజీ, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కాలనీలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు వీలుగా అందరూ, అన్ని స్థాయిల్లో కృషి చేయాలని కోరారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సైతం మద్యం, ఇసుక రవాణాలో అక్రమాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెలాఖరు నాటికి 19 మండలాలలో 14 కాంగ్రెస్ విభాగాలకు కమిటీలను ప్రతిపాదించి, నియామకాలు చేపట్టనున్నట్టు తెలిపారు. అదే క్రమంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం కూడా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, మార్టిన్ లూథర్, మోతా శారద, సువర్ణ, పట్నాల శ్రీనివాస్, బెజవాడ రంగారావు, అబ్దుల్లా షరీఫ్, డాక్టర్ వడయార్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకుంటున్న స్వర్ణాంధ్ర

- నిర్వాహకులు గుబ్బల రాంబాబు
- గొడుగుల పంపిణీ



గొడుగులు అందుకున్న లబ్ధిదారులు

రాజమహేంద్రవరం సిటీ: లబ్ధిదారులకు అవసరమైన సేవలందించడంలో స్వర్ణాంధ్ర సేవా సంస్థ శైలి ఎప్పుడు ప్రత్యేకంగా ఉంటుందని నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. వర్షాల కారణంగా వృద్ధాశ్రమంలో భోజనానికి బయట ప్రాంతాల నుంచి వస్తున్న వృద్ధులు, నిరాశ్రయులు, లబ్ధిదారుల ఇబ్బందులను గమనించి వారికి మంగళవారం గొడుగులను అందజేసినట్టు రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం లబ్ధిదారులకు కాళ్లకు చెప్పులు, కట్టుకునే బట్టలు, కప్పుకునే దుప్పట్లు, చేతి కర్రలు, సంచులు, చేతి ఖర్చులకి నగదు, వైద్య సదుపాయం, వాకర్లు, వీల్ చైర్లతో పాటు, వికలాంగులకు మూడు చక్రాల రిక్షాలు, కాస్మెటిక్స్, అవసరమైన అన్ని సౌకర్యాలు ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. అవసరమైన వారికి సహాయం అందించడంలో స్వర్ణాంధ్ర ముందుంటుందని అన్నారు. ఎప్పుడూ అనాధులను ఆదుకుంటుందని తెలిపారు. దాతలు అందిస్తున్న దుస్తులను నగరంలోని పలు ప్రాంతాల్లో ఉచిత రీతిన అవసరార్థులకు కూడా అందిస్తున్నామని రాంబాబు తెలిపారు.

ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలికి అవుట్ స్టాండింగ్ ఎడ్యుకేటర్ అవార్డు



డాక్టర్ సురేఖను సత్కరిస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, అధ్యాపకులు

కంబాలచెరువు: యునైటెడ్ హెరిటేజ్ ఆర్ట్స్ కల్చర్ ఆర్గనైజేషన్ తెలుగు అసోసియేషన్ ఆఫ్ థాయిలాండ్ సంయుక్తంగా ఈ నెల 5న అంతర్జాతీయ ఉపాధ్యాయ వేడుకలు నిర్వహించారు. దసరా కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా తమ కళాశాలకు చెందిన కెమిస్ట్రీ విభాగానికి చెందిన డాక్టర్ పి.సురేఖకు ×ఔట్ స్టాండింగ్ ఎడ్యుకేటర్స్ అవార్డు దక్కిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. అధ్యాపకులు అందరూ తమ వృత్తికి న్యాయం చేయాలని, అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. థాయిలాండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అవార్డును యూహెచ్ఏసీవో అధ్యక్షుడు రామ, టి.ఎ.టి. అధ్యక్షుడు పవన్ చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. ప్రిన్సిపాల్, కెమిస్ట్రీ విభాగ అధ్యాపకులు ఫల పుష్ప గుచ్ఛాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ అన్నపూర్ణ, అకడమిక్ కో–ఆర్డినేటర్ ఎ.రాజేశ్వరి, శాఖాధిపతి టి.శ్రీనివాస్, జాకబ్, సురేష్, శ్రీధర్, మూర్తి, కె.వెంకటేశ్వర రావు, త్రినాథ్, రాజేశ్వరి, రజనీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు



మధ్యాహ్నం నుంచే మూసివేసిన ప్రభుత్వ మద్యం దుకాణం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యంపాలసీ ప్రకారం బుధవారం ఉదయం 10 గంటల నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభంకానున్నాయి. సోమవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నిర్వహించిన లాటరీలో మద్యంషాపులు దక్కించుకున్న అభ్యర్థులు 125 మంది మంగళవారం ప్రభుత్వం నిర్ణయించిన ధరలో పది శాతం చలనా రూపంలో చెల్లించారు. దీంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చింతాడ లావణ్య ప్రొవిజన్‌లైసెన్స్‌తో పాటు రిటైల్‌కోడ్‌ను ఇచ్చారు. తద్వారా ఏపీబేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిపోలో మద్యం స్టాక్‌ను తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ చింతాడ లావణ్య మాట్లాడుతూ మద్యం షాపులు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటలలోపు మాత్రమే అమ్మకాలు నిర్వహించుకోవాలన్నారు. అలాగే నేషనల్ హైవేకు సిటీ పరిధిలో ఎటువంటి ఆంక్షలు లేవని, గ్రామీణ ప్రాంతాల్లో 500 మీటర్ల డిస్టెన్స్, 20 వేలు కంటే తక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో 220 మీటర్ల డిస్టెన్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. పాఠశాలలకు, ఆలయాలకు 100 మీటర్ల దూరంలో మద్యం షాపులు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. మద్యం షాపులు యజమానులు ఎక్సైజ్ శాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

మద్యం స్టాకు అందజేత

ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిపో నుంచి బుధవారం ఉదయం 10 గంటల నుంచి మద్యంషాపులకు స్టాకును సరఫరా చేస్తామని అసిస్టెంట్ మేనేజర్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ జారీ చేసిన ప్రొవిజన్ లైసెన్స్, రిటైల్ కోడ్ తీసుకుని వస్తే సదరు మద్యం షాపు యజమానికి స్టాకు ఇస్తామన్నారు. ప్రభుత్వం మద్యం షాపులకు మంగళవారం రాత్రితో గడువు ముగుస్తుందన్నారు. ప్రభుత్వమద్యం షాపులలోని సరుకును సంబంధిత ఎక్సైజ్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో సిబ్బంది డిపోకు తరలిస్తారన్నారు. ప్రభుత్వ మద్యం షాపులలో స్టాక్ నిల్ గత రెండు రోజులుగా ప్రభుత్వ మద్యం దుకాణాలలో స్టాక్ లేక మందుబాబులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధవారం నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి రానుండడంతో ప్రభుత్వ మద్యందుకాణాలకు స్టాక్‌ను నిలుపుదల చేశారు. రాజమహేంద్రవరం ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిపో పరిధిలోని 145 మద్యం షాపులలో సోమవారం సాయంత్రం నుంచి స్టాక్ లేక పోవడంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి షాపులు మూసివేశారు. మరికొన్ని షాపుల్లో క్వార్టర్ నిబ్‌లు నిండుకోవడంతో మందుబాబులు నిరాశతో గుర్రై వెనుదిగారు.

వేధింపులు ఆపాలి

కడియం: మండలం డ్వాక్రా ఏపీఎం అప్పలకొండ కక్రపెత్తనం ఆపాలని వీఏవోలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని పలువురు వీఏవోలు డ్వాక్రా కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని ఓ డ్వాక్రా గ్రూపులో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో ఆ సంఘంపై విచారణ చేపట్టి నిజానిజాలు తేల్చి సమస్యను పరిష్కరించాల్సిన ఏపీఎం అక్కడి రాజకీయ నాయకులతో కలిసి వీఏవోలను వేధింపులకు గురిచేస్తోందని ఆరోపించారు. సమస్యను సాగదీస్తూ మండలం మొత్తం వీఏవోల వ్యవస్థను చులకన భావం కలిగేలా వ్యవహరిస్తున్నారన్నారు. అన్ని సంఘాలపై విచారణ చేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారన్నారు. తాము ఎటువంటి అవకతవకలకు పాల్పడలేదన్నారు. ఆరోపణలు వచ్చిన సంఘాలపై విచారించి, నిజానిజాలు నిగ్గుతేల్చకుండా అన్ని సంఘాలను విచారణ పేరుతో బెదిరిస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.